సాక్షి
వికారాబాద్


సోమవారం । 4 । నవంబర్ । 2024



దళారులే దిక్కు!

మొక్కజొన్న రైతులకు తిప్పలు తప్పడం లేదు. మార్కెట్ అందుబాటులో లేక దళారులే దిక్కవుతున్నారు.

8లో▸



కందిలో సస్యరక్షణ ముఖ్యం

కందిలో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి జయశంకర్ తెలిపారు.

8లో▸



ఫిర్యాదులు పరిష్కరిస్తాం

విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ తాండూరు ఏడీఈ శంకర్ పేర్కొన్నారు.

9లో▸

న్యూస్‌రీల్

పరిగి సీఐకి డీఎస్పీగా ఉద్యోగోన్నతి



శ్రీనివాస్

పరిగి: పరిగి సీఐగా పని చేస్తున్న శ్రీనివాస్ డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఎనిమిది నెలలుగా సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పోలీసు ఉన్నత అధికారులు పదోన్నతి కల్పించారు. ఈ మేరకు శ్రీనివాస్ సోమవారం డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నట్టు వెల్లడించారు.

నేడు సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటి సమగ్ర సర్వేపై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సర్వేలో పాల్గొనే 84 మంది ఈ శిక్షణలో పాల్గొంటారన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు

యాలాల: పగిడియాల, రాస్నం, బెన్నూరు గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖ అధికారులు, నాయకులు హాజరవ్వాలని పార్టీ నాయకులు తెలిపారు.

కుల గణన విధులు అసంబద్ధం

టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

అనంతగిరి: కుల గణన చేపట్టిన ప్రభుత్వం ఉపాధ్యాయుల విధుల కేటాయింపులో అసంబద్ధంగా వ్యవహరించిందని.. ఇది అశాస్త్రీయంగా ఉందని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే విధులు కేటాయించి.. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను విస్మరించడం సరికాదన్నారు. దివ్యాంగులకు, గర్భిణులకు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి సర్వే విధులు వేయొద్దని డిమాండ్ చేశారు. పాఠశాల విధులు నిర్వహణ అనంతరం సర్వేకు వెలితే గ్రామస్తులు అందుబాటులో ఉండరని సమయం మార్చాలని కోరారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని ఉపాధ్యాయులంతా సర్వేలో పాల్గొనేలా విధులు కేటాయించాలని కోరారు.

ప్రపంచ చాంపియన్‌గా తిరిగి రావాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెజ్లర్ ప్రకాశ్‌సింగ్, ఎమ్మెల్యే తదితరులు

మణికొండ: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌గా నిలిచి దేశానికి తిరిగి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లికి చెందిన ప్రకాశ్‌సింగ్ ఈ నెల 9న రష్యాలో జరిగే ప్రపంచ బెల్ట్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రకాశ్‌సింగ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలకు మన రాష్ట్రం నుంచి ఎంపిక కావటం ఎంతో ఆనందంగా ఉందని, విజయం సాధించి తిరిగి రావాలని సీఎం ఆకాంక్షించినట్టు ప్రకాశ్‌సింగ్ తెలిపారు. త్వరలోనే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని ఆయన తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సంఘం జెండాను ఆవిష్కరించారు. పర్వతాలు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పలు రంగాల కార్మికులు, కర్షకులకు ఏఐటీయూసీ అండగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, జంగయ్య, పవన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏరివేత.. నత్తనడక

బోగస్ ఓటర్ల గుర్తింపు 80 శాతమే
- ఆధార్ అనుసంధానంలో యంత్రాంగం అలసత్వం
- పని ఒత్తిడే కారణం అంటున్న అధికారులు





వికారాబాద్: బోగస్ ఓటర్ల ఏరివేతకు జిల్లా అధికారులు చేస్తున్న కసరత్తు నత్తను తలపిస్తోంది. గతంలో వేగంగా చేసిన అధికారులు ఇప్పుడు పట్టించుకోవడమే మానేశారు. ఏడాది క్రితం ప్రారంభమైన ఆధార్ అనుసంధాన ప్రక్రియ నేటికీ పూర్తికాలేదు. 80 శాతం పూర్తవ్వగా మిగిలిన వారిలో ఎక్కువగా డబుల్ ఓటర్లుగా ఉన్నందునే ఆధార్ కార్డులు ఇచ్చేందుకు సహకరించక ఈ ప్రక్రియ మందగించినట్లు తెలుస్తోంది. కాగా సీడింగ్‌లో భాగస్వాములుగా ఉన్నవారు ఇతర పనుల్లో నిమగ్నమవడం మరో కారణమని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల పర్యటన

బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఆధార్ అనుసంధాన ప్రక్రియ చేపడుతున్నారు. ఈ క్రమంలో ఓటర్ల అభిప్రాయం సైతం స్వీకరిస్తున్నారు. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో పేర్లు నమోదై ఉంటే ఎక్కడ ఉంచాలి..? ఎక్కడ తొలగించాలనే విషయంలో వారి నిర్ణయం మేరకే వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దీంతో పాటు వారి ఆధార్ కార్డు జిరాక్సులు సైతం సేకరిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామాలు, బూత్‌ల వారీగా అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం మేర అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియ పూర్తయితే బోగస్ ఓటర్లను తొలగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ పనిని పూర్తిగా పక్కకు పెట్టేశారు.

గెలుపోటములు శాసిస్తున్న బోగస్

ప్రస్తుతం ఆధార్ అనుసంధాన ప్రక్రియ నిలిచిపోయింది. ఒక్కో నియోజకవర్గంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు వేలల్లో ఉన్నారని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అనుసంధానం వంద శాతం పూర్తయితే ఎంత మంది ఓటర్లను తొలగించారనే విషయంలో స్పష్టత రానుంది. ఓటర్లు తమ పేర్లను గ్రామాల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పాలక సంస్థల్లోనూ ఓటురుగా నమోదు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పట్టణాల్లో గ్రామీణ ఓటర్ల పేరు నమోదు చేయించి గెలుపోటములను శాసిస్తున్నారు.

కొడంగల్, దౌల్తాబాద్‌లో 92శాతం

ఆధార్ అనుసంధాన ప్రక్రియను అధికారులు ఏడాది క్రితమే ప్రారంభించారు. నాలుగు నియోజకవర్గాల్లో 8,83,541 మంది ఓటర్లుండగా 6,99,771 మంది ఓటర్ల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. మరో 1,83,770 మంది ఓటర్ల అనుసంధానం పెండింగ్‌లో ఉంది. కొడంగల్, దౌల్తాబాద్ మండలాలు ఈ ప్రక్రియలో 92శాతంతో ముందుండగా.. కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి, పూడూరు, బొంరాస్‌పేట్ మండలాలు 72 శాతంతో వెనకంజలో ఉన్నాయి.

సన్నాలకు రూ.500 బోనస్



దోమ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సన్నాలకు రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచి ప్రారంభించామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. దొడ్డు రకం క్వింటాల్‌కు రూ.2,320, సన్నాలకు రూ.2,820 మద్దతు ధర అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, చౌడాపూర్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి–అధ్యక్షుడు భరత్ కుమార్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, చౌడాపూర్‌లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలు

దోమ: పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా సన్నాలకు రూ.500 బోనస్ కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ యాదవరెడ్డి, మాజీ సర్పంచులు అనంతయ్య, యాదయ్యసాగర్, కోళ్ల సురేశ్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, అంతిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, యాదయ్యసాగర్, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతల అసహనం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ పటిష్టకు పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఇవ్వడంలేదని కాంగ్రెస్ కుల్కచర్ల మండల మాజీ అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య అన్నారు. ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సమయంలో ఆయన పార్టీ పెద్దల తీరుపై బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు.

అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కూలదోస్తాం

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

ఇబ్రహీంపట్నం రూరల్: అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కూలదోస్తామని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పేర్కొన్నారు. కొంగరకలాన్‌లో ఆదివారం పార్టీ మహాసమ్మేళనం (మొదటి ప్లీనరీ) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే 15 వేల కిలోమీటర్ల మహాపాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2025 జనవరి 5న ఆదిలాబాద్ నుంచి మహాపాదయాత్ర ప్రారంభించి 2028 వరకు మూడున్నర సంవత్సరాలు కొనసాగిస్తానని తెలిపారు. గతంలో పదివేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్టు గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రెండున్నర లక్షలకు పైగా ఓటర్లుంటే 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు ఉన్నారని అన్నారు. మూడు శాతం లేని రెడ్డిలకి అన్ని పార్టీలు టికెట్లు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే ప్రభుత్వ, ప్రైవేటు భూములు వందలాది ఎకరాలు ఆక్రమించారని, వీటన్నింటినీ భవిష్యత్తులో కక్కిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, రాఘవేంద్ర ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్, దుర్గాప్రసాద్, అన్నెల లక్ష్మణ్, రెహమాన్, శ్రీకాంత్, హరప్ప శివన్, కార్తీక్, తులసిగారి రవీందర్, భిక్షపతి, రాకేష్, భవాని శేఖర్, గజ్జల భాస్కర్, భవాని కిషన్, నాగార్జున, శ్రావణ్, ప్రదీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లే

హుడాకాంప్లెక్స్: విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లేనని సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ చంగారి మాధవరెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని చంపాపేట, సరూర్‌నగర్, ఆటోనగర్ విద్యుత్ డివిజన్లలో వినియోగదారుల సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శారదానగర్ కాలనీలో అంతర్గత పోల్స్ ఏర్పాటు చేయాలని, చెట్ల కొమ్మలు కొట్టివేయాలని ఫిర్యాదు రావడంతో 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని ఏఈ నాగరాజును ఆదేశించారు. సదస్సులో డీఈ రాజారాంరెడ్డి, ఎస్ఏఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఫ్యూచర్.. నజర్



నందివనపర్తిలోని వ్యవసాయ భూమి

ఫ్యూచర్‌సిటీపై భరోసా
- సమీపంలోని గ్రామాలపై దృష్టి
- వ్యవసాయ భూముల కొనుగోలుకు ఆసక్తి
- ఆరా తీస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే ఆశ

యాచారం: ఫ్యూచర్‌సిటీ చుట్టూ ఉన్న గ్రామాల్లోని వ్యవసాయ భూములపై పలువురు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు దృష్టి సారించారు. తమ సన్నిహితుల ద్వారా ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పట్టా భూముల ధరలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. వ్యవసాయానికి అనుకూలంగా, భూగర్భజలాలు పుష్కలంగా, ఎర్రటి నేలలున్న భూములను కొనుగోలు చేసి పెట్టాలని కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ యాచారం–కందుకూరు మండలాల సరిహద్దులో ఫ్యూచర్‌సిటీని నెలకొల్పడానికి సంకల్పించడం తెలిసిందే. కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి నిర్మించబోయే ఫ్యూచర్‌సిటీకి 300 అడుగుల రోడ్డు, మెట్రో రైలు మార్గానికి పచ్చజెండా ఊపింది. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందనే భావనతో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పెట్టుకోవాలని చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆయా గ్రామాల్లో తమ సన్నిహితులతో కలిసి వ్యవసాయ భూములను పరిశీలిస్తున్నారు.

ఆ గ్రామాలపై ఫోకస్..

కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, ఆకులామైలారం, బెగరికంచె, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, లేమూర్, గూడూర్, యాచారం మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, నందివనపర్తి, యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ భూములపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఆదిబట్ల, కొంగరకలాన్, మహేశ్వరం మండల పరిధిలోని రావిరాల, తుక్కుగూడ తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్‌సిటీకి సమీపంలోని యాచారం, కందుకూరు గ్రామాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం రూ.50 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు ధర పలుకుతోంది.

ఫాంహౌస్‌లపై ఆసక్తి

యాచారం, కందుకూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి. భూగర్భ జలాలకు ఢోకా లేదు. అందుకే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫాంహౌస్‌లు నిర్మించుకుంటే భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందనే నమ్మకం కొనుగోలుదారుల్లో ఉంది. అత్యధికంగా 5 నుంచి 10 ఎకరాల్లోపే కొనుగోలు చేసేలా దృష్టి సారించారు.

కొనేందుకు పలువురి ఆసక్తి



ఫ్యూచర్‌సిటీపై భరోసాతో సమీపంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల కొనుగోలుకు కొంత మంది పెద్దలు ఆసక్తి చూపిస్తున్నారు. కొందరైతే నేరుగా రైతులతోనే మాట్లాడుకుని వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రియల్ వ్యాపారి, హైదరాబాద్

దాడులు చేసినా | ఆగని దందా

- రెచ్చిపోతున్న శంకర్‌దాదాలు
- నర్సింగ్ హోంలను తలపిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలు
- నోటీసులు ఇస్తున్నా తీరుమారని ఆర్‌ఎంపీ, పీఎంపీలు

నకిలీ వైద్యం విచ్చలవిడిగా సాగుతోంది. ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తూ డాక్టర్లుగా చెలామణి అవుతున్నారు. ఫస్ట్ ఎయిడ్ చేయాల్సిన వారు అడ్డగోలు వైద్యం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత కన్నెత్తి చూడడం లేదు.



ఇటీవల ఓ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మెడికల్ కౌన్సిల్ బృందం

తాండూరు: నకిలీ వైద్యులు రెచ్చిపోతున్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు వందల సంఖ్యలో నకిలీ వైద్యులు పుట్టుకొస్తున్నారు. ప్రథమ చికిత్సలు చేయాల్సిన చోట నర్సింగ్ హోంల తరహాలో క్లినిక్‌లు కొనసాగిస్తున్నారు. ఫార్మసీ చేసిన వారి ధ్రువీకరణ పత్రాలు అడ్డుపెట్టుకుని మెడికల్ షాపులు నిర్వహిస్తూ నకిలీ మందులు విక్రయిస్తూ జనాల ప్రాణాలు హరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏడాది పనిచేసి..

బీపీ చూసే వారి నుంచి ఇంజెక్షన్ ఇవ్వడం వచ్చిన వారంతా తాండూరులో వైద్యులుగా చెలామణి అవుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో నకిలీ వైద్యులు పెరిగిపోయారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద ఏడాది పాటు అసిస్టెంట్‌లుగా పని చేసి వైద్యులుగా మారుతున్నారు. అనుమతులు లేకుండా ఇంజక్షన్‌లు ఇస్తూ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. దీంతో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు మానసిక, శారీరక ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాడులు చేస్తున్న వైద్య శాఖ అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే చర్చలు వినిపిస్తున్నాయి.

అసోసియేషన్లపై విమర్శలు

మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 80 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఉన్నారు. ఆర్‌ఎస్‌పీ, పీఎంపీ అసోషియేషన్ ఏర్పాటు చేసుకొన్నారు. ఎవరికైనా వైద్యం వికటిస్తే అసోసియేషన్ ప్రతినిధులు ఏకమై విషయం బయటకు పొక్కకుండా చూస్తున్నారనే విమర్శలున్నాయి. రోగులకు ప్రాథమిక వైద్యం అందించి ఎంబీబీఎస్ డాక్టర్లకు రెఫర్ చేయకుండా క్లినిక్‌లలో బెడ్‌లు ఏర్పాటు చేసి ఫ్లూయిడ్స్ ఎక్కిస్తుండడంతో విమర్శలకు తావిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు సైతం నిర్వహిస్తున్నారు.

వైద్యారోగ్య శాఖ నిబంధనలు
- ఆర్‌ఎంపీలు, పీఎంపీ సెంటర్ల వద్ద సైన్ బోర్డులపై ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఉండాలి. క్లినిక్ అనే పదం వాడొద్దు.
- పేరు పక్కన డాక్టర్ అనే పదం వాడటం నేరం. ప్రాథమిక చికిత్స కేంద్రాల్లో పడకలు, వైద్య సాంకేతిక పరికరాలు వాడడం నిషేధం.
- ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లలో ఇంజక్షన్‌లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వొద్దు
- ప్రిస్క్రిప్షన్ ఇవ్వరాదు.
- ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలలో శిక్షణ పొందిన, అనుమతి పొందిన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచాలి.

సీజ్ చేసినా మారని తీరు

- పెద్దేముల్ మండలం చైతన్య నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కాలికి గాయమైందని మంబాపూర్‌లో ఆర్‌ఎంపీని సంప్రదించాడు. ఆయనకు నాసిరకం మందులు ఇవ్వడంతో ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో కాలిని తొలగించేశారు. బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకుని క్లినిక్‌ను సీజ్ చేశారు.
- తాండూరులోని డీసీఎంఎస్ సమీపంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను నిర్వహిస్తున్న ఓ వైద్యుడు అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నాడని క్లినిక్‌ను సీజ్ చేశారు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీ సెంటర్‌లపై దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో పెద్ద ఎత్తున మెడిసిన్‌లు, ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి. దీంతో వాటిని సీజ్ చేశారు. అసోషియేషన్ సభ్యులు తమపై దాడులు చేయకుండా ఆపాలంటూ ప్రజా ప్రతినిధులను కలవడం చర్చనీయాంశమైంది.

చర్యలు తీసుకొంటాం



అనుమతులు లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లాలో పలు క్లినిక్‌లు సీజ్ చేశాం. ఎప్పటికప్పుడు అధికారుల బృందం మానిటరింగ్ చేస్తోంది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం జిల్లాలో క్లినిక్‌లను విరివిగా తనిఖీ చేస్తున్నాం. టీఎంపీ బృందం గుర్తించిన అంశాల ప్రకారం క్లినిక్‌లపై చర్యలు తీసుకొంటాం. – రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, వికారాబాద్

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ప్రసాద్ (ఫైల్)

కొడంగల్ రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొడంగల్ పట్టణంలోని కలాల్‌వాడీలో ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలాల్‌వాడీ కాలనీకి చెందిన ప్రసాద్(43) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన మొదటి భార్య అనారోగ్యంతో గతంలో చనిపోయింది. వీరికి ఇద్దరు కూతుర్లు. ఈ క్రమంలో 11ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలుకా ఆడికె గ్రామానికి చెందిన సురేఖను రెండో వివాహం చేసుకున్నాడు. ఏడాది క్రితం వీరికి ఓ బాబు పుట్టాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సురేఖ తల్లిగారింట్లో ఉంటోంది. గత నెల 31న ప్రసాద్ ఆడికె గ్రామానికి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడు తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

చేపల కోసం వెళ్లి మృతి

సర్పన్‌పల్లి ప్రాజెక్టు వద్ద విషాదం


రెడ్యానాయక్ మృతదేహం

అనంతగిరి: చేపల వేటకు చెరువులో దిగి గల్లంతైన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొంరాస్ పేట మండలం మద్దులపల్లి తండా చెందిన రెడ్యానాయక్(36)తో పాటు మరో ముగ్గురు సర్పన్‌పల్లి ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వచ్చారు. వారందరూ చెరువు తూములోకి దిగారు. అయితే తూము నుంచి నీటి ప్రవాహం అధికంగా రావడంతో రెడ్యానాయక్ అందులోనే చిక్కుకున్నాడు. అతని వెంట దిగిన ముగ్గురు మాత్రం సురక్షితంగా వెనుకకు వచ్చారు. వారు బయటకు వచ్చి స్థానికుల సహాయంతో బయటకు తీసే ప్రయత్నం చేశారు. కానీ ఆచూకీ లభించే సరికే రెడ్యానాయక్ మృతి చెందారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు.

అసైన్డ్ భూమి కొనుగోలుకు యత్నం

వ్యక్తిపై కేసు నమోదు

మీర్‌పేట: బాలాపూర్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అసైన్డ్ భూమిని కొనుగోలు చేసేందుకు యత్నించిన వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూమిని నార్సింగ్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయాలనుకోవడంతో పాటు లేఅవుట్ ఏర్పాటుకు పూనుకున్నారు. ఇందుకోసం కబ్జాలో ఉన్న కొందరు గ్రామస్తులతో అగ్రిమెంట్ సైతం చేసుకున్నాడని తహసీల్దార్ ఆరోపిస్తూ ప్రవీణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గత నెల 31వ తేదీన మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అగ్రిమెంట్ చేసుకున్న కాపీలను సమర్పించాలని ఆదేశించినట్లు, దీనిపై విచారణ చేపడుతున్నామని సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

కేశంపేట: ఇంట్లో ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(25)కి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నరేవెళ్లె గ్రామానికి చెందిన మాధవితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భార్యాభర్తలు కొంత కాలంగా కేశంపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత్ డ్రైవర్‌గా, మాధవి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం భార్య కూలీ పనులకు వెళ్లిన తర్వాత శ్రీకాంత్ ఇంట్లో వంటగదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు.

దళారులే దిక్కు!

- కొనుగోలు కేంద్రం లేక మొక్కజొన్న రైతుల ఇబ్బందులు
- రెండింతలు పెరిగిన ఖర్చు.. తగ్గిన దిగుబడి
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

పెద్దేముల్: ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. అందుబాటులో మార్కెట్ లేక దళారులే దిక్కవుతున్నారు. ఏటా పెట్టుబడి రెండింతలు పెరిగినా దిగుబడి లేదని వాపోతున్నారు. పంట చేతికి వచ్చిన కొనుగోలు కేంద్రం లేక విక్రయించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దేముల్, గాజీపూర్, బుద్దారం, తట్టెపల్లి, మంబాపూర్ , కందనెల్లితండా, జనగాం, ఇందూరు, గోట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. స్థానికంగా మొక్కజొన్నకు అనువైన నేలలు ఉండటంతో రైతులు ఏటా వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పొలంలో మొక్కజొన్న సాగు చేసేందుకు సుమారు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు అవుతుంది. పంట చేతికి వచ్చే సమయంలో అందుబాటులో కొనుగోలు కేంద్రం లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని అంటున్నారు. పంట సాగు చేయడం ఓ వంతు అయితే విక్రయించడం సవాలుగా మారింది. మరోపక్క కొంతమంది పంటను నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబెట్టిన సమయాల్లో చిన్నపాటి చినుకులు పడితే ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తాండూరు ప్రాంతంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి

మొక్కజొన్న పంటకు తాండూరు నియోజకవర్గంలో మార్కెట్ లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. మర్పల్లి, వికారాబాద్, మోమిన్‌పేట ప్రాంతాల నుంచి దళారులు వచ్చి విక్రయాలు చేస్తున్నారు. వారు చెప్పిందే ధర అంటూ విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ అందుబాటుల్లో లేక రూ.2,300లకు క్వింటాల్ విక్రయించాల్సి వస్తుందని అంటున్నారు. ప్రస్తుతం రైతుకు రూ.3,000ల వరకు మద్దతు ధర వస్తే పెట్టిన పెట్టుబడులు పోను కొంత అన్నదాతకు మిగులుతుంది.


పెద్దేముల్‌లో సాగుచేసిన మొక్కజొన్న


రోడ్లపై ఆరబెట్టిన మక్కలు

గిట్టుబాటు కావడం లేదు



దళారులు చెప్పిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తుంది. మద్దతు ధర లభించక చేసిన కష్టం గిట్టుబాటు కావడం లేదు. ఓ సమయంలో పెట్టుబడులు కూడా వచ్చే ఆస్కారం కనబడటం లేదు. ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటుతో పాటు మద్దతు ధర సైతం కల్పించాలి. స్థానికంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– కరీమొద్దీన్, రైతు, పెద్దేముల్

రూ.3వేలు రావాలి



మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.3వేలు ధర రావాలి. ప్రస్తుతం మార్కెట్లో రూ.2,200 నుంచి రూ.2,300 దళారులు పలకడంతో పెట్టుబడులకే సరిపోతున్నాయి. మార్కెట్ లేక దళారులు చెప్పిందే వేదం అనాల్సి వస్తుంది. ఇదేమని ప్రశ్నిస్తే మాకు గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. దిక్కులేని స్థితిలో విక్రయాలు చేస్తున్నాం.

– ప్రకాశ్‌రెడ్డి, రైతు, గాజీపూర్

విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి



మండలంలోని రైతులు మొక్కజొన్నతో పాటు స్వీట్‌కాన్ పంటను అధికంగా సాగు చేస్తున్నందున ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి. విత్తనాలు దొరకక వికారాబాద్ నుంచి తీసుకొస్తున్నాం. ధర ఇష్టం వచ్చినట్లు ఇస్తున్నారు. మొక్కజొన్న పంట సాగు వల్ల పశువులకు కూడా మేత దొరుకుతుంది. దీంతో రైతులకు కొంత లాభం చేకూరుతుంది.

– వెంకటేశం, రైతు, జనగాం

24న కార్తీకమాస వన భోజనాలు

జంగమ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు హంపయ్యస్వామి

కొడంగల్ రూరల్: పవిత్రమైన కార్తీకమాసంలో నిర్వహించనున్న వన భోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జంగమ సమాజం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు హంపయ్యస్వామి కోరారు. ఆదివారం నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలోని ఇంద్రనీలేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జంగమ సమాజ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన కోస్గి పట్టణంలోని దౌల్తాబాద్ రోడ్‌లోని అనంత శ్రీనివాస్‌గుప్తా వ్యవసాయక్షేత్రంలో వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేస్తునట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని జంగమ సమాజం కుటుంబ సభ్యులంతా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమాలు నిర్వహించుకోవడంతోనే పరిచయాలు పెరుగుతాయని, తద్వారా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జంగమ సమాజం జిల్లా కన్వీనర్ అమరలింగస్వామి, సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్‌స్వామి, కోశాధికారి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో జంగమ సమాజం సభ్యులు

అమ్మా.. నేను వెళ్లి పోతున్నా

- క్షమించమని లేఖ రాసి ఉరేసుకున్న యువకుడు
- కుదురుమల్ల గ్రామంలో విషాదం

దుద్యాల్: తండ్రి మరణించిన 45 రోజులకే కుమారుడు వ్యక్తిగత కారణాలతో ఉరేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామానికి చెందిన ఈడిగి భాగ్యమ్మ, చంద్రశేఖర్‌ల కుమారుడు శివకుమార్(26) హైదరాబాద్‌లో కొంత కాలంగా డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దీపావళి రోజున గురువారం రాత్రి శంషాబాద్‌లో అద్దె గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరూ గ్రహించలేరు. రెండు రోజుల తర్వాత శనివారం రాత్రి ఇంటి యజమాని గదిలో నుంచి దుర్వాసన రావడంతో తెరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే శంషాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపు తెరవగా ఫ్యాన్‌కు ఉరేసుకొని శివకుమార్ విగత జీవిగా కనిపించాడు. వెంటనే మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులను సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు పోస్టుమార్టం అనంతరం కుదురుమల్ల గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.


శివకుమార్ (ఫైల్)

ఫిర్యాదు చేసిన తల్లి

గదిలో పోలీసులు పరిశీలించగా సూసైడ్ లేఖ దొరికింది. అందులో 'అమ్మా.. నేను వెళ్లి పోతున్నా.. నీకు ఎప్పుడు ఏమీ చేయలేదు. అక్కలు, బావలు అమ్మను మంచిగా చూసుకోండి' అంటూ శివకుమార్ రాశాడు. మృతుడికి ఇద్దరు అక్కలున్నారు. వారికి పెళ్లిల్లు సైతం అయ్యాయి. 45 రోజుల కిత్రమే మృతుడి తండ్రి మరణించాడు. యువకుడి సెల్‌ఫోన్ అక్కడ లేకపోవడంతో తల్లి భాగ్యమ్మ అనుమానం వ్యక్తం చేస్తూ శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తెలియాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కందిలో సస్యరక్షణ ముఖ్యం

- యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారి జయశంకర్




ఎన్కేపల్లిలో సాగు చేసిన కంది

మోమిన్‌పేట: కందిలో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి జయశంకర్ తెలిపారు. పప్పు ధాన్యాల్లో ముఖ్యమైన పంట కంది. మండలంలో ఖరీఫ్‌లోనే కందిని అంతర పంటగా ఎక్కువగా సాగు చేస్తున్నారు. పెసర, మినుము, సోయాబీన్, మొక్కజొన్న తదితర పంటలలో అంతర పంటగా కందిని రైతులు విరివిగా పండిస్తున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారంగా ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. కంది సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి పేర్కొంటున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

కంది పొలంలో మొదటి పంటను తీసుకొన్న తర్వాత పిచ్చి గడ్డి లేకుండా గుంటుకతో లేదా ఒకసారి కూలీలతో కలుపు తీస్తే సరిపోతుంది. పూతకు వచ్చే ముందు వేపనూనెతో పిచికారీ చేయాలి. ఆ తర్వాత పూత బాగా వచ్చిన వెంటనే మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మందులను పిచికారీ చేయాలి. నేడు మార్కెట్‌లో ఒకసారి పిచికారీ చేస్తే 10 రోజుల వరకు పురుగు ఆశించని మందులు అందుబాటులో ఉన్నాయి. కీలకమైన పిందె దశలో రైతు కంది పొలంను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి.

పూత దశనే కీలకం

కందిలో ముఖ్యంగా పూత దశ నుంచి పిందె దశ వరకు కీలకం. అప్పుడు ఏ మాత్రం రైతు అశ్రద్ధ చూపిన పంట చేతికి రాదు. ఉదయం పూట మంచు కురవడం, సాయంత్రం పూట మేఘావృతం కావడం కందికి మంచిది కాదు. చలి లేకపోవడంతో రైతులు కంది పంటను చూస్తూ ఉండాలి. పూతకు ముందు నుంచి పిచికారీలో వేపనూనె ఉండే విధంగా జాగ్రత్త తీసుకోవాలి.

వలలో చిక్కుకొని.. ఊపిరాడక

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి దుర్మరణం

నందిగామ: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి వలకు చిక్కుకొని చెరువులోనే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జంగోనిగూడ శివారులోని అక్కమ్మ చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జంగోనిగూడ గ్రామానికి చెందిన జంగ జంగయ్య(42) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని అక్కమ్మ చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు జంగయ్య ఆచూకీ కోసం వెతికారు. అర్ధరాత్రి గట్టుపైన దుస్తులు, చెప్పులు కనిపించడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికారు. రాత్రి కావడంతో ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా చేపల కోసం వేసిన వలకు చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.


జంగయ్య (ఫైల్)

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన సుధాకర్‌రెడ్డి



అనంతగిరి: పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు పూల మొక్క అందించారు. అనంతరం జిల్లా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కష్టపడిన కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందని, జిల్లా రాజకీయాలపై తనకు పూర్తి అవగాహన ఉన్నట్లు పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో జిల్లా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాస్ ముదిరాజు తదితరులు ఉన్నారు.

వంతెన లేక.. రాకపోకలు సాగక

- తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గిరిజనుల ఆవేదన
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి

బంట్వారం: వంతెన లేకపోవడంతో కోట్‌పల్లి మండల పరిధిలోని మల్‌శెట్టిపల్లి తండావాసులకు ఏళ్ల తరబడి తిప్పలు తప్పడం లేదు. దీంతో గిరిపుత్రులు తరచూ ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. వర్షా కాలం వాగు దాటడం చాలా కష్టతరం. కంకనాలపల్లి గ్రామం నుంచి మల్‌శెట్టిపల్లితండా వెళ్లే మార్గంలో వాగు ఇబ్బందులు సృష్టిస్తోంది. అయినా తండావాసులు ప్రాణాలకు తెగించి అలాగే వెళ్తూ నిత్యం ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వాగుపై సీసీ రోడ్డు ఉండడంతో నీరు పారి నాచు పట్టి జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కాలి నడకన వెళ్లే వారు తరచూ కింద పడి గాయపడుతున్నారు.

నాచు పట్టిన సీసీ రోడ్డు

సీసీ బెడ్‌పై నుంచి నీరు పారడం తగ్గే వరకు నాచు అలాగే ఉంటుంది. తండాకు వెళ్లే వాహనదారులు పొరపాటున ఎడమ వైపున కింద పడితే అంతే సంగతులు. అటు వైపులో నీరు చాలా లోతుగా ఉంటుంది. ఈత రాని వారు ప్రాణాలు కోల్పోవాల్సిందే. వంతెన నిర్మాణం కోసం తండావాసులు చాలా కాలంగా పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత పీఆర్ డీఈ జితేందర్‌ను సంప్రదించగా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.


వంతెన లేని మల్‌శెట్టిపల్లితండా వాగు

వాగు దాటడం కష్టం



వానాకాలం వాగు దాటడం చాలా కష్టంగా మారింది. బ్రిడ్జి లేకపోవడంతో నిరంతరం వాగు పారుతూనే ఉంటుంది. వాగు వస్తే వరద ఉధృతి తగ్గే వరకు ఎక్కడి వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి. వాగులో నుంచి తాత్కాలికంగా వేసిన సీసీ బెడ్ ప్రస్తుతం నాచు పట్టి ప్రమాదకరంగా మారింది. వాగు దాటే క్రమంలో వాహనదారులు, పాదచారులు జారి కింద పడుతున్నారు.

– నాన్యనాయక్, మల్‌శెట్టిపల్లితండా

అనాథలకు అండగా

అబ్దుల్లాపూర్‌మెట్: అనాథల ఇబ్బందులు తెలుసుకున్న ఓ మిత్రబృందం వారికి అండగా నిలిచింది. నగదు, నిత్యావసర సరులకు పంపిణీ చేసి దాతృత్వం చాటుకుంది. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1995–96లో పదోతరగతి చదవిన విద్యార్థులు సోషల్ మీడియాలో హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ విద్యార్థుల బాధలను తెలుసుకున్నారు. దీంతో వారు సాయం చేయాలని నిర్ణయించుకుని నగదుతో పాటుగా బియ్యం, పప్పులు, వంట నూనె అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లోని 125 మంది విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.



కూలీలు రాక.. తిప్పలు తప్పక


ఆస్పల్లిగూడలో కూలీలు దొరకక చేనుపైనే ఉన్న పత్తి

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న అన్నదాతలు
- పెరుగుతున్న అదనపు ఖర్చులు

షాబాద్: కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరతతో నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని, విత్తనాలు నాటి, అవి పెద్దవై పంట దశకు చేరే వరకు చేసిన శ్రమ ఒక ఎత్తయితే.. పంట చేతికి రావడం మరో ఎత్తుగా మారింది. స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో పంట కోత దశలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు నుంచి తీసుకొచ్చి..

జిల్లాలో 558 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో సాగవుతున్న పంటలకు కూలీల కొరత గణనీయంగా ఉంది. షాబాద్ మండలంలో దాదాపు 32 వేలకు మంది రైతులు ఉండగా.. అధిక శాతం మంది పత్తి పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా 35 వేల ఎకరాల సాగు భూమి ఉంటే సుమారు 18 వేల ఎకరాల్లో పత్తి సాగయిందని అధికారుల అంచనా. అయితే ఆ పొలాలన్నీ ఒకేసారి దిగుబడి రావడంతో పత్తి తీసేందుకు అవసరమైన కూలీలు స్థానికంగా దొరకడం లేదు. అంతే కాకుండా ఏటా గ్రామాల్లో కూలీల సంఖ్య భారీగా తగ్గుతోంది. కర్నూల్ జిల్లాకు చెందిన కూలీలను తీసుకొచ్చి నివాసం ఏర్పాటు చేసి స్థానిక రైతులు పత్తి తీయించుకుంటున్నారు. దీంతో కూలీ డబ్బులతో పాటు వసతులు కల్పించేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

అదనపు భారం

మండలంలోని చిన్న, సన్నకారు రైతులు వివిధ గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోల్లో రోజువారీగా కూలీలను తీసుకొచ్చి పత్తిని తీయిస్తున్నారు. అందుకు కూలీ డబ్బులతో పాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి, ఈ అదనపు ఖర్చులు పోను కనీసం తమ కష్టానికి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలో పత్తితీతకు రూ.15

పత్తి బాగా దిగుబడి రావడం, అన్ని పొలాల్లో ఒకేసారి కాపు రావడంతో రైతులకు కూలీల అవసరం అధికం కావడంతో డిమాండ్ అమాంతం పెరిగింది. పత్తి తీయడానికి గతంలో కిలోకి రూ.12 ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది కూలీల కొరత కారణంగా కేజీకి రూ.15 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పత్తి క్వింటాకు రూ.7వేలు చెల్లించే వ్యాపారులు దిగుబడి పెరగడంతో ప్రస్తుతం రూ.6వేల నుంచి 6,500 మాత్రమే చెల్లిస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


ప్రొద్దటూరులో అవగాహన కల్పిస్తున్న జెండర్ టాస్ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: ప్రజలందరూ ప్లాస్టిక్‌ని విడిచిపెట్టినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జెండర్ టాస్ కమిటీ సభ్యులు నాగమణి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులతో కలిసి ర్యాలీ, అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడడం వల్ల మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, అదే విధంగా పర్యావరణం సైతం విషతుల్యం అవుతుందన్నారు. పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలు ప్లాస్టిక్‌కి బదులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మి, మల్లేశం, భాగ్యమ్మ, శిరీష, మానస, నందిని, రేఖ, చందన, కార్తీక్, సతీష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.